# స్వయంకృతాలు

"ఇంకా చాలా సేపు చదవాలా ఆ పుస్తకం?" అన్నది చూసి, చూసి సావిత్రి. శర్మ పుస్తకం దించి, తలెత్తి చూసి నవ్వాడు.

"వూ.. మరి రేపు క్లాసులో ఏం చెప్పమంటావు పాఠం... చదువుకోకపోతే?" అన్నాడు.

సావిత్రి ఓ నిముషం అతని వంక చూసి వెళ్లిపోయింది. కాస్సేపటికి రేడియో త్రిప్పడం వినిపించింది శర్మకి.

"సావిత్రీ!" అని పిల్చాడు అతను. రేడియో ఆపేసి, యివతలికి వచ్చిందామె. "ఏమిటి?" అన్నది.

"రా కూర్చో!" అన్నాడతను.

"వూహూ"

"రమ్మంటే. రా మరి ఖబుర్లు చెబుతాను. రా!" అన్నాడు. ఆమె వెళ్ళి అతని ప్రక్కనే సోఫాలో కూర్చుంది.

"ఇంక చెప్పు" అన్నాడతను. ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని.

"మీరే చెప్పండి."

ఆమె కళ్లు అతని మీద నిల్పి "నిన్న నేనడిగిన విషయం... చెప్పండి!"

శర్మ ఆమె చేతిని విడిచి పెట్టాడు. "నువ్వు ఆ మాట మాత్రం వదలవు సావిత్రీ! నీకిదేం ముచ్చట చెప్పు!" అన్నాడు.

ఆమె నవ్వింది. "ఏం అడిగితే? ఇంత చక్కని ముఖం ఆ నొక్కుల జుట్టు.. గట్టిగా గాలి వీస్తే గులాబీగా ఐపోయే శరీర కాంతి ఏమీ జరక్కుండానే గడిచాయా?"

సావిత్రి అడ్డంగా తలూపింది. "నేను నమ్మను. పోనీ ప్రేమ లేకపోతే మానె. ఎప్పుడూ ఒక్కసారి కూడా మనస్సు చలించలేదూ? కాలేజీలో అందమైన అమ్మాయిలతో పరిచయాలుండేవి కదా.. అంత మందితో కలిసి నాటకాలు వేసేవారు కదా. ఒక్కసారైనా మనస్సు కొంచెం మొగ్గలేదూ ఎవరి వేపు?"

శర్మ లేచి నుంచున్నాడు. సిగరెట్టు తీసి అంటించుకుని, అగ్గిపుల్ల ఏష్ట్రేలో పడేశాడు. టేబిలు

మీదున్న ఫాన్ స్విచ్ వేశాడు. ఫానుగాలి 'రయ్'మని తగిలి, అతని జుట్టులోంచి ఒక వుంగరం నుదుటి మీద పడి అందంగా వూగింది.

"చెప్పనా మరి నిజంగా? గోల పెట్టవు కదా విని?" అన్నాడు చిరునవ్వుతో.

సావిత్రి కూడా నవ్వింది... "చెప్పమనేగా నేను అడిగేది. జరిగినది ఎల్లాగు జరిగింది. ఇంక నేను గోల పెట్టి మాత్రం లాభమేమిటి?"

శర్మ సిగరెట్టు పొగ గాలిలోకి వూది, కళ్లు సగం మూసుకుని, ఆ పొగ వంక చూశాడు.

"నేను బి.ఎ.లో వున్నాను అప్పట్లో. ఇరవై ఏళ్లు వున్నాయన్న మాట. మా క్లాసులో ఆరుగురుండేవారు ఆడపిల్లలు. వాళ్ళందరిలోకి చలాకీగా వుండేది ఓ అమ్మాయి. వాళ్ళంతా ఎదురుపడినప్పుడు సహజంగా ఎవరివైనా చూపులు ఆ అమ్మాయి మీదకే మరలేవి. చాలా డబ్బున్న వాళ్ళమ్మాయి."

సావిత్రి వేపు తిరిగాడతను. అతని వంకే చూస్తోంది ఆమె. "పేరేమిటి?" అన్నది.

"రాధ!. ఆ పేరు కూడా ఆరోజుల్లో రొమాంటిక్‌గా అనిపించేది. నేను సైకిలు మీద కాలేజి గేటుని సమీపించేసరికి, నా వెనుకనుంచి దూసుకు వస్తుండేది ఆమె కారు. రోజూ అల్లాగే జరిగేది. ఆకారు నన్ను దాటుతోంటే, సైకిలు దిగి ప్రక్కకి నిలబడేవాడిని. ఆ నల్లని కారుని కళ్ళతో చూడడమే కానీ,... అంతకంటే నా మనస్సు ఏ విధంగాను నిలిచేదు కాదు.. ఆ దృశ్యం మీద."

ఒకరోజు.. అల్లాగే నేను ప్రక్కకి నుంచుని వున్నాను. కారు వెళ్ళిపోయింది. నా దృష్టి అక్కడే పడిన ఒక రుమాలు మీదికి పోయింది. వంగి, తీశాను. తెల్లని రుమాలు... ఇంగ్లీషు రంగుల్లో సన్నని పూలున్నాయి ఓ మూల. అప్రయత్నంగా వాసన చూశాను. సువాసన వేస్తోంది. గులాబీ వాసన అనిపించింది. అసలు నాకు అప్పట్లో అన్ని పూలూ ఒకే మాదిరి వుండేవి. వాసనలు మహా ఘాటుగా వుంటేనే కానీ నా ముక్కుకి తగిలేవి కావు. అల్లాంటిది అది గులాబీ వాసనని గ్రహించడానికి ఓ కారణం వుంది. ఆరోజు కారులోకి చూశాను. రాధ గులాబీలు పెట్టుకుని, యీ రుమాలు బయటకు పడేసింది గేటు దగ్గర.

ఆ రుమాలు నేను జేబులో పెట్టుకున్నాను. నా మనస్సులో వూహలు మెదిలాయి. రుమాలు ఎందుకు పడేసింది? సైకిలు స్టాండులో వుంచి క్లాసులోకి వెళ్లి పుస్తకాలు పెట్టి, వరండాలో నుంచున్నాను. రాధ చేసిన పని నా మనస్సులో ఆ ఆలోచనలను రేపింది. నేనున్నానని తెలిసి ఆ అమ్మాయి రుమాలు పడేస్తే ఒకటే అర్థం దానికి... నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. నేను నాకే కొత్తగా అనిపించాను. పది నిముషాల తర్వాత లెక్చరరు రాలేదు కాబట్టి మాకు క్లాసు లేదని తేలింది.

నేను మెల్లిగా గ్రౌండులో తిరిగి తిరిగి ఆడవాళ్ళ వెయిటింగు రూము వేపు వెళ్ళాను. ఆ రుమాలు యిచ్చేద్దామనే సదుద్దేశ్యంతోనే వెడుతున్నానని నన్ను నేను సమాధానపరుచుకున్నాను. నేను మెట్ల వరకు వెళ్లేసరికి రాధ ఎదురుపడింది. వరండాలోనూ చుట్టుప్రక్కలా ఎవరైనా ఉన్నారా అని చూడటం నేను మొదట చేసిన పని.

నన్ను చూసి ఏమనాలో తెలీక కాబోలు 'నమస్కారం' అంది.

నేను కూడా 'నమస్కారం' అని జేబులోంచి రుమాలు తీశాను. రాధ ముఖంలో ఆశ్చర్యం కనుపించింది.

'ఇది మీది. ఇందాక గేటు దగ్గర దొరికింది. యిద్దామని...'

'గేటు దగ్గరా? గులాబీపూలు కట్టుకుని వచ్చాను. పూలు తీసి తల్లో పెట్టుకున్నా. ఇది ఏమయిందో అని యిప్పుడే చూసుకుంటున్నాను' అన్నది ఆమె తడబడుతూ...

నేను నవ్వాను హీరోయిక్‌గా. 'పూలు తీసి తల్లో పెట్టుకుని యిది బైటపారేశారు మీరు. కాయితం

అనుకున్నారేమో ఒకవేళ. ఇంకా పూల వాసన వేస్తూంది మత్తు ఎక్కేలా...' అన్నాను. నేను మళ్లీ వాసన చూస్తూ. రాధ ముఖం ఎర్రబడింది.

ఆమె వంక ఒక్క నిముషం చూసి 'మనకి క్లాసుల్లేవు యిప్పుడు' అన్నాను.

'నమస్కారం' అని లోపలికి వెళ్లబోయింది ఆమె.

'ఇదుగోండి రుమాలు. మీ దగ్గర కపూర్ వున్నదా' అన్నాను.

'ఉంది' అని లోపలికి వెళ్లి తెచ్చియిచ్చింది ఆమె.

మళ్లీ వారం యిస్తానని చెప్పి నేను వచ్చేశాను. మైదానంలో గడ్డి మీద పడుతున్న ఎండ అందంగా కనిపించింది నాకు." శర్మ ఆగాడు.

"ఇంతేనా?" అన్నది సావిత్రి.

అతను నవ్వాడు. "చాలా ఏమిటీ నీకింతవరకు.?"

"ఇంకేమైనా జరిగితే చెప్పండి. అసలు విషయం ఎందాకా వెళ్లిందీ చెప్పక మీరు ఎండ అందంగా ఉందని వర్ణిస్తారేమిటండీ?" అన్నదామె.

"చూశావా నీకిప్పుడే అసహనం. అందుకే నేను ఏమీ చెప్పను. శాంతంగా బ్రతుకుదామనుకున్నాను."

"చెప్పండి. ఏమీ అనను. ఇంక చెప్పండి" అన్నదామె.

"ఎండ అందంగా కనుపించింది. అన్ని వస్తువులవంకా మామూలుగా కాక అరమోడ్పు కన్నులతో చూడ బుద్ధి వేసింది.

ఆతర్వాత రోజూ రాధను గేటు దగ్గర చూడడం, నమస్కారాలను కోవడం పరిపాటైంది. మరి వారానికి పుస్తకం యిచ్చేశాను. పరిచయస్తుల్లాగా మసలేవాళ్ళం యిద్దరం.

మాకు ప్రిపరేషను సెలవులిచ్చేశారు. ఆ రోజుల్లోనే ఒకనాడు మేము వీడ్కోలు పార్టీ పెట్టుకున్నాము. పార్టీ చాలా బాగా జరిగింది. కొందరం ఆవేశంగా మాట్లాడాము. రాధ విద్యార్థినుల తరఫున మాట్లాడింది. రాత్రి ఎనిమిదయింది అంతా అయేసరికి.

చాలా మంది వెళ్లిపోయారు. పార్టీ ఏర్పాటు చేసిన కొందరం మాత్రం మిగిలాము. వరండాలోకి వచ్చేసరికి రాధ అక్కడ నిలబడి వుంది. నన్ను పిలిచింది. నేను వెళ్లాను. 'కారు రాలేదు. ఇంటి దాకా దిగబెడతారా?' అన్నది. నేను తలూపాను. ఆమెతో పాటు ఆడపిల్లలు ఎవరూ లేరు. అందరూ వెళ్లిపోయారు. తానొక్కతే ఉన్నదన్నమాట. నేను నాతోటి స్టూడెంట్సుతో చెప్పి వచ్చి, 'పదండి' అన్నాను. వాళ్ళంతా ఏమనుకుంటారన్న ఆలోచన రాలేదనుకుంటాను నాకు.

వెన్నెల కొంచెంగా ఉంది. నా మనస్సు భారంగా వుంది. కాలేజీ భవనాలు, చెట్లూ, మైదానాలూ, గుడ్డి వెన్నెలలో మసక మసకగా కనుపించాయి దిగులుగా అనిపించింది. మరి కొన్ని రోజులలో యివన్నీ వదిలి పోవాలి కదా అని నా పక్క రాధ నడుస్తున్న విషయం కొంత సంతోషం కలిగించింది.

'ఏం చేస్తారు మీరు బి.ఏ. ఐనాక?' అన్నాను.

'ఏమీ అనుకోలేదింకా... మీరు?' అన్నది.

'ఎం.ఏ. చదవాలని... కానీ క్లాసు రావాలిగా పార్టు త్రీలో..' అన్నాను. మౌనంగా నడుస్తోందామె. మరో వంద గజాలలో వుంది వాళ్లిల్లు. ఆ రోడ్డు నిర్జనంగా వుంది.

'నాలుగేళ్ళు మీరూ, నేనూ ఈ కాలేజీలో వున్నామన్న మాటే కానీ...' ఏమనాలో తోచక ఆగిపోయాను నేను...

ఆమె నవ్వింది. 'స్నేహం కలవలేదంటారా?'

వాళ్లింటి గేటు దగ్గరకు వచ్చేశాం. వరండాలో లైటు వేసి వుంది. తీగెల్లోంచీ, పూల చెట్లలోంచీ వెలుగు కనుపిస్తోంది.

గేటు దగ్గర ఆమె వెనక్కి తిరిగి 'ఎప్పుడు కనుపిస్తారు మళ్లీ?' అన్నది. మబ్బులు విడిపోయి, తెల్లని వెన్నెల ఆమె మీద పడుతోంది. తెల్లని చీరె కట్టుకున్న ఆమె నా కళ్ళకి దేవకన్యలా అనిపించింది. ఆ గేటు తీసుకుని, లోపలికి వెళ్లిపోతే ఎంతో దూరమైపోతుంది నాకు... అనిపించింది.

'రాధా!' అన్నాను నేను. ఆమె ముఖాన చిరునవ్వు కనిపించింది.

'కనుపించరా?' అన్నది.

"చటుక్కున ఆమె చేయి పట్టుకున్నాను. రెండు చేతుల మధ్య ఆమె చేయి పట్టుకున్నాను. ఆమె తల సిగ్గుతో వంచేసింది. అవతల వరండాలో ఎవరో కదిలిన అలికిడైంది. చటుక్కున చేయి వదిలించుకుని వెళ్ళిపోయింది. నేను కూడా వెనక్కి తిరిగి వచ్చేశాను."

అతను సావిత్రి వంక చూశాడు. ఆమె ముఖం వెలవెలబోతోంది.

"అంతే సావిత్రీ! అంతే జరిగింది. పరీక్షలు జరిగినన్నాళ్ళూ ఆమె కనుపించలేదు నాకు. నిజానికి కనుపిస్తుందేమోనని దాక్కున్నాను నేను. పరీక్షలు కాగానే వాళ్ళ నాన్నగారికి బదిలీ ఐపోయి రాధ వెళ్లిపోయిందని తెలిసింది. ఆనాటి నుంచీ యిప్పటి వరకు చూడలేదు ఆమెని"

సావిత్రి తల ప్రక్కకు త్రిప్పుకుని కూర్చుంది. "చూడు ఏమిటదీ?" అని ఆమెను తన వేపుకు తిప్పుకున్నాడు శర్మ.

ఆమె కళ్ళు వాల్చేసింది. క్రింది పెదవి పంటితో నొక్కి పట్టింది. గడ్డం ఎర్రపడింది. భర్త పలకరింపుకి ఆమె కళ్ళు మరింత వాల్చేసింది. ముఖం బలవంతాన త్రిప్పేసుకోబోయింది. కానీ, నల్లని కనురెప్పల కొనలనుంచి రాలిన కన్నీటి చుక్కలు అతని చేతి మీద పడ్డాయి.

"ఏమిటది? ఇలా చూడు... సావిత్రీ! చూశావా మరి యింత బాధపడతావా?" ఆమె అతన్నించి విడిపించుకుని చరచర అవతలి గదిలోకి వెళ్ళిపోయింది.

శర్మ వెంట వెళ్లాడు. ఆమె మంచం మీద పడుకుని ఏడుస్తోంది. "సావిత్రీ!.. ఇల్లా కూర్చో. విను నా మాట!" బలవంతాన ఆమెని కూర్చోబెట్టి తను పక్కన కూర్చున్నాడు.

"చెప్పేదాకా వూరుకున్నావు కాదు. తర్వాత యిల్లా బాధపడతావా? అది చిన్నతనం. ఆ అమ్మాయి నా మీద యిష్టం చూపింది. నా వయస్సు కూడా అల్లాంటిదే! నిండా యిరవై ఏళ్లు లేవు. కానీ నా మనస్సులో ఆ అమ్మాయికి ఎన్నడూ చోటు లేదు. కొంచెం వూగిసలాడింది మనస్సు. అంతే. చూడు సావిత్రీ... నేను అందానికి లొంగిపోయే వాడిననుకున్నావా? ఇంకా ఎన్ని వుండాలి స్త్రీలో నేను కోరేవి? నీలాంటి సంపూర్ణమైన వ్యక్తి కోసమే తపించాను. నువ్వు దొరికావు."

సావిత్రి ఏడుపు మానేసింది. కానీ.... అతని చేతుల స్పర్శ తగిలితే వళ్లు జలదరిస్తోంది. మనస్సంతా వర్షించడానికి సిద్ధంగా వున్న మేఘంలాగా బరువుగా వుంది. అతణ్ణి సమ్మోహపరచి, మతిలేనివాడుగా ప్రవర్తించేటట్లు చేసే శక్తి తనకొక్కతికే వుండాలి. ఆ శక్తి ఒక్క క్షణమైనా మరో స్త్రీ ప్రదర్శించగలిగిందంటే... గుండెలవిసిపోతాయి. తనని సముదాయిస్తున్న భర్త దగ్గరగా జరిగింది సావిత్రి.

రైలు ఆగింది ఏదో స్టేషనులో. చదువుతున్న పత్రిక మడిచి, కిటికీలోంచి బయటకు చూడసాగింది సావిత్రి. తప్పనిసరై యీ పాసెంజరులో ఎక్కాల్సి వచ్చింది. శర్మకి భయం. తను రాత్రి ప్రయాణం చేస్తుందంటే. పినతండ్రి కూతురు పెళ్లికి వెళ్లాలని అనుకోగానే, మునిగిపోయినట్లుగా పాసెంజరుకి టిక్కెట్టు కొనుక్కుని వచ్చాడు. తీరా స్టేషనులో వచ్చి చూసేసరికి ఫస్టుక్లాసు ఆడవాళ్ళ పెట్టె అంతకీ తానొక్కత్తే అయింది. మగవాళ్ళ పెట్టెలో జనం చాలా మంది వున్నారు. టైము లేకపోయింది మరో పెట్టెలోకి మారడానికి. పోర్టరు ధైర్యం చెప్పాడు ఫరవాలేదని, దారిలో ఎవరో ఒకరు ఎక్కుతారని.

ప్లాటుఫారం అంతా సందడిగా వుంది. "అమ్మా! తలుపు తీయండి' అన్న పిలుపుకి తల ప్రక్కకి తిప్పి చూసింది సావిత్రి. లేచి, పైన వున్న లాక్ తీసింది. పోర్టరు, వెనకాల ఒకావిడ ఎక్కారు. పెట్టె పైన పెట్టి, "బిస్తరు విప్పాలా?" అని అడిగాడు వాడు. ఆమె వద్దన్నట్లు తలూపి, వాడికి డబ్బిచ్చి పంపేసింది.

తలుపు దగ్గరకి వెళ్లి నిలబడింది. ప్లాటుఫారం మీద యిద్దరు మొగవాళ్ళు ఒకావిడ నిల్చొని వున్నారు. ఆమె వాళ్ళతో మాట్లాడసాగింది. ఈలోగా గంట కొట్టారు.

"ఉంటామండీ.. రాధగారూ! ఉత్తరం వ్రాయండి చేరినట్లు" అని అన్నది ఆ రెండో ఆవిడ.

రాధ అన్న పేరు వినగానే ఉలిక్కిపడి చూసింది సావిత్రి. రైలు బయలు దేరింది. ఆమె వాళ్లు కనిపించినంత సేపు చెయ్యి వూపి లోపలికి వచ్చి కూర్చుంది సావిత్రి కెదురుగా.

చామనచాయగా వుంది. ముఖం గుండ్రంగా వుంది. ముక్కు మాత్రం కొంచెం వెడల్పించుకున్నట్లుగా వుంది. పొడుగ్గా వుంది మనిషి. రాధ! ఎదురుగా వున్న నల్లని ట్రంకు మీద సన్నని,తెల్లని అక్షరాలతో ఓ మూల మిస్. రాధ బి.ఏ. అని వ్రాసి వుంది. సావిత్రి వుండబట్టలేక పోయింది.

"ఏ వూరెడుతున్నారు?" అన్నది. ఆమె చెప్పి, గంటే ప్రయాణమన్నది. "మీరు?" అని అడిగిందామె. సావిత్రి చెప్పింది. ఆమె వెంటనే ఉత్సాహం కనుపరిచి ""ఎవరి తాలూకు?" అని అడిగింది. తన పినతండ్రి పేరు చెప్పి "మీకు తెలుసా?" అని అడిగింది సావిత్రి.

"లేదండీ! నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో వుండేవాళ్ళం. నా బి.ఏ. అవగానే బదిలీ ఐపోయి వచ్చేశాం"

"ఏ సంవత్సరంలో చదివారు కాలేజీలో" అని అడిగి, శర్మ క్లాసేనని నిర్ధారణ చేసుకుంది సావిత్రి.

చివరకు "మీ పేరు రాధ కదూ!" అన్నది.

"ఔనండీ! పెట్టెమీద వుంది కదూ!" అని నవ్వింది రాధ.

సావిత్రి చూపు ఆమె చేతుల మీదకి పోయింది. వ్రేళ్లు లావుగా వున్నాయి. కణుపులు మోటుగా వున్నాయి. గాజులు కూడా చేతికి అందమివ్వడం లేదు. ఒంటి ముత్యం ఉంగరం వేలికి వున్నది. ఆ చేతికి శోభించడం లేదు. సావిత్రి చూపు మరల్చి ఆమె ముఖం వంక చూసింది. రాధ మేగజీను చేతుల్లో వుంచుకుంది కానీ బయటకు చూస్తోంది.

ఈ చేతుల్లోనూ, ఈ ముఖంలోనూ ఏమి అందాలు కనుపించాయి శర్మకి? ఆ వేళ్లు తన భర్త చేతుల్లో ఒకసారి యిమిడాయి. ఈ ముఖంలోని నవ్వుకి చలించాడు.... అని స్ఫురించేసరికి సావిత్రి మనస్సులో బాధ వువ్వెత్తున లేచింది.

రెండు నిముషాలు గడిచాయి. "శర్మ అనే ఆయన ఎవరైనా ఉండేవారా మీ క్లాసులో?"

"శర్మ? ఔను! మీకేమవుతారు?" అన్నదామె.

"ఆయన మీకు బాగా తెలుసా?'

"పరిచయం వుండేది కొంచెం. మీటింగుల్లో వాటిల్లో పాల్గొంటూండే వాళ్ళం. మీకు ఏమవుతారాయన?"

సావిత్రి తల వంచేసింది. "మా వారే!" అన్నది. అని తలెత్తి రాధ ముఖంలో మార్పుల కోసం చూసింది.

రాధ నవ్వింది. "ఓహో! శర్మగారి భార్య అన్నమాట మీరు. ఎక్కడున్నారాయన? చాలా ఏళ్లయింది కలిసి" అన్నది.

మార్పు లేమీ లేవు ఆ ముఖంలో.

"ఇప్పుడు కాలేజీలో లెక్చరరుగా ఉన్నారు. మీకు బాగా పరిచయం వుండేదా?" మళ్లీ అడిగింది సావిత్రి.

"మీటింగుల్లోనే కలిసేవాళ్ళం. ఒకటే గ్రూపు మా యిద్దరిదీ. చాలా బాగా మాట్లాడేవారాయన. లెక్చరరుగా రాణిస్తారు." చిరునవ్వుతో అన్నది రాధ.

"ఐతే, ఆయన కాలేజీలో హీరో అన్నమాట అప్పట్లో"

ఇలా అనడం శుద్ధ తెలివి తక్కువ అని తెలుసు సావిత్రికి. కానీ రాధని కదపాలనిపిస్తుంది. రాధ నవ్వి వూరుకుంది.

సావిత్రి యింకేమీ మాట్లాడలేదు. వెనక్కు తిరిగి బయటకు చూసింది. శర్మ తనని యిల్లా అన్యాయం చేశాడు. రాధ అప్పటి విషయాలను గుర్తుకు తెచ్చుకుంది. తన మీద అంత మరులు చూపించి మళ్ళీ వేరే పెళ్ళి చేసుకున్నాడు. ఏమిటీ మనిషని హేళనగా అనుకుంటుంది. ఎంత చులకన ఐపోతుంది. ఆమె దృష్టిలో తను. సావిత్రికి దు:ఖమయంగా కనిపిస్తూంది అంతా. ఉక్రోషం వచ్చింది ఆమెకి. ఎంత ఆపుకుందామన్నా ఆగలేదు.

కొంత సేపు గడిచింది. రాధ లేచిన అలికిడైంది. కొంగుతో గబగబ కళ్ళు తుడుచుకంది సావిత్రి.

"ఇల్లా చూడండీ!" అన్నది రాధ. ఆమె తన ప్రక్కని వచ్చి కూర్చుంది. "ఏమిటో బాధపడుతున్నారు. నాకు చెప్పకూడదా?" అన్నది. సావిత్రికి తన మీద తనకే జాలి వేసింది. జరిగింది చాలక ఆమెతో చెప్పుకోవాలి కూడానా? చెప్పుకుంటే ఆమె తనని ఓదారుస్తుందా? ఎంత ఖర్మం వచ్చింది. మరింత ఏడుపు వచ్చింది సావిత్రికి.

"ఇల్లా తిరగండి. చెప్పండి మరి." సావిత్రి సరిగ్గా కూర్చుంది. కళ్ళు తుడుచుకుంది.

"ఆయనతో అప్పట్లో బాగా స్నేహమేమో మీకు?" అన్నది మెల్లగా.

రాధ మాట్లాడలేదు. ప్రశ్నార్థకంగా చూసింది.

"మీకు పెళ్లికాలేదు కదూ?" అన్నది సావిత్రి మళ్లీ.

రాధ లేదని తలూపింది. ఒక్క క్షణం ఆగి, "మీరెందుకని బాధ పడుతున్నారు. ఏదో జ్ఞాపకమొచ్చినట్లుంది మీకు చెప్పండి! బాధ తీరుతుంది" అన్నది.

"మగవాళ్ళు విచిత్రంగా వుంటారు. కాలేజీ రోజుల్లో వాళ్లని బొత్తిగా నమ్మడానికి వీల్లేదు."

రాధ ఏమీ అనలేదు కానీ. ఆమె కనుబొమ్మలు మాత్రం ముడి పడ్డాయి. రైలు వేగం తగ్గుతోంది స్టేషనురాబోతుంది.

రాధ లేచి నుంచుని, చీరె సవరించుకుంది. "నేనీ స్టేషనులో దిగాలండీ! మీ ఎడ్రస్సు యివ్వరూ నాకు?" అన్నది. తటపటాయించి ఎడ్రసు చెప్పింది సావిత్రి. రాధ బాగ్ తెరిచి, చిన్న నోటు పుస్తకంలో వ్రాసుకుంది.

రైలు ఆగింది. రాధ పోర్టరుని కేకేసి, సావిత్రి వంక తిరిగింది. "వస్తానండీ.. శర్మగారిని అడిగానని చెప్పండి. మీ పేరు చెప్పారు కాదు యింతకీ" అన్నది.

సావిత్రికి ఎందుకనో యీమెను వదలాలనిపించలేదు. ఆమెకి తనెరుగున్న విషయం చెప్పేసి ఆమె తెల్లబోతోంటే, తన భర్త హృదయంలో తనకే స్థానం వున్నదని గట్టిగా చెప్పాలి. ఈ ఆలోచనలన్నీ చిక్కిరి బిక్కిరిగా వున్నాయి ఆమె మనస్సులో.

"సావిత్రి నాపేరు. అల్లాగే చెబుతా వారితో. ఆయనకి సంతోషం మీ పేరెత్తితే!"

రాధ కనుబొమలు మళ్ళీ ముడిపడ్డాయి. తన భావం ఆమె అర్థం చేసుకుందని స్పష్టమైంది సావిత్రికి.

రాధ రైలు దిగింది. గంట కొట్టారు. రైలు బయలుదేరి వెళ్ళిపోతున్నా ఆమె మళ్ళీ సావిత్రి వేపు చూడలేదు.

"ఉత్తరం రాయకూడదూ సావిత్రీ వస్తున్నట్లు? ఎన్నడైనా ఒక్కత్తివీ వచ్చావా?" అన్నాడు టాక్సీ వాడికి డబ్బిచ్చేసి లోపలికికొచ్చిన శర్మ.

సావిత్రి యిల్లంతా ఓమాటు కలియ తిరిగి వచ్చింది. "రాయలేదు" అన్నది. పెట్టె తెరచి బట్టలు తీసుకుంది.

"పెళ్ళి ఎల్లా జరిగింది?"

సావిత్రి బట్టలు మంచం మీద పడేసి, లోపలికెళ్ళి పెద్ద డబ్బా తెచ్చి తను తెచ్చిన పిండివంటలన్నీ తీసి, దానిలో సర్దసాగింది. "బాగానే జరిగింది" అని సమాధానం చెప్పింది.

శర్మ ఆమె దగ్గరగా వచ్చి, ఆ డబ్బా ఆమె చేతుల్లోంచి లాక్కుని అవతల పెట్టాడు.

"ఏమిటా సమాధానాలు? వస్తూనే ఏం కోపం వచ్చింది చెప్పు నీకు?" అన్నాడు. సావిత్రి లేచి, అతని మాటలు వినిపించుకోనట్లు బట్టలు తీసుకుంది.

"నేను స్నానం చేసి రావాలి" అన్నది శర్మ వూరుకోలేదు.

"ఎందుకు సావిత్రీ... యిల్లా వేధిస్తావు నన్ను. మళ్ళీ ఏమైంది?" అని విసుక్కుని, మళ్లీ తమాయించుకున్నాడు. "మీ అమ్మ, నాన్న ఏమైనా అన్నారా అక్కడ? మీ ఆయన ముత్యాల నెక్లెసు ఎందుకు చేయించాడని కోప్పడ్డారా?"

సావిత్రి నవ్వలేదు యీ హాస్యానికి. పైగా శర్మ నుంచి అవతలకు తప్పుకుని, ముఖం త్రిప్పుకుని ఏడవడం మొదలు పెట్టింది.

"ఏమిటి సావిత్రి... చూడు ఏమిటది. ఇంత బేలవైతే ఎల్లా నువ్వు! చెప్పవూ నాకు." భర్త అనునయిస్తూనే వున్నాడు. సావిత్రి ఏడుస్తూనే వుంది. ఎల్లాగో చివరికి అన్నది ఆమె. "నా బ్రతుకిల్లా అన్యాయమై పోతుందనుకోలేదు."

శర్మ అసహనం చూపాడు. "ఏం సావిత్రీ... అల్లాంటి మాటలు అంటావు. నీకు వచ్చిన కష్టమేమిటో చెప్పు"

"ఆవిడ కనుపించింది రైల్లో. చెప్పింది మీరు స్నేహంగా వుండేవారని!"

"ఏవిడ? స్నేహంగా వుండడమేమిటి?" సావిత్రి కళ్లు తుడుచుకుంది. "మీకు తెలియదా ఎవరో? ఆ రాధే!"

శర్మ ఒక్క నిముషం అర్థం కానట్లు చూశాడు. తర్వాత నవ్వాడు. సావిత్రిని దగ్గరకు లాక్కుని "ఊరుకో.... ఎవరైనా వింటే నవ్వి పోతారు" అన్నాడు.

"నవ్వేటట్లుగానే వుంది నా బ్రతుకు... నన్నెందుకు యిల్లా మోసం చేశారు చెప్పండి మీరు..." మళ్ళీ ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"నీకు రాధ కనుపించడమేమిటి? అడిగావా కొంపదీసి నేను చెప్పిన కథని పట్టుకుని?"

"అడగాలేమిటి? తనే చెప్పింది. మీ పేరు చెప్పగానే ఎంతో ఆనందించింది. మీ యిద్దరిదీ ఒకే గ్రూపనీ, మీరంటే కాలేజీలో అంతా ఇద్దై పోయేవారనీ చెప్పింది."

శర్మకి ఇది నమ్మాలో నమ్మకూడదో తెలియలేదు. "ఎక్కడ కనిపించింది నీకు?" అన్నాడు.

"రైల్లో.. వెళ్లేటప్పుడే కనిపించింది."

శర్మ సావిత్రి ముఖం పైకెత్తాడు గడ్డం పట్టుకుని. "సావిత్రీ... నేను చెప్పిందంతా నువ్వు నమ్మడం నా దురదృష్టం. అసలు నేను చెప్పడం నా బుద్ధి పొరబాటు. నీ మీద ఒట్టేసి చెబుతున్నాను. సావిత్రీ అదంతా అబద్ధం. ఆ రాధతో నాకేమీ పరిచయం లేదు. నమ్మవా నా మాట."

భర్త కళ్ళల్లో వేదన చూసింది సావిత్రి. తనేమంటుందో అని అశాంతితో చలిస్తూ తన ముఖంలో వెదుకుతూ చూస్తున్నాయి ఆ కళ్ళు.

"నిజం సావిత్రీ! నువ్వు అదే పనిగా అడిగితే, తమాషాకి చెప్పాను. నువ్వు ఏడ్చినప్పుడే చెప్పేయాల్సింది అంతా అబద్ధమని. కానీ ఏమిటో అప్పుడు తోచలేదు... యిదిల్లా పరిణమిస్తుందని."

సావిత్రి అతని వేపు, కళ్ళు విశాలంగా తెరుచుకుని చూస్తోంది. అతణ్ణి చూస్తే, ఆక్షణంలో జాలేసింది. కళ్ళు వాల్చేసి, వణికే వేళ్లతో అతని కాలరు సవరించింది. తన మీద ఒట్టు వేయడు అతను. అదే ఆమె ధైర్యం.

మెల్లిగా నవ్వింది సిగ్గుపడుతూ... "ఏమో భగవంతుడికి తెలుసు నిజానిజాలు." ఆ నవ్వుతో శర్మకు లోకంలో చీకటి తొలగి పోయింది.

మరి కాస్సేపటికి మామూలు మనిషైంది సావిత్రి. రైల్లో జరిగినవన్నీ చెప్పింది. పెళ్ళిలో జరిగినవన్నీ చెప్పింది. తిరుగు ప్రయాణమంతా వర్ణించింది. అతను ఆఫీసుకి వెళ్లేవరకు అతనికి మాట్లాడ్డానికి వ్యవధి దక్కలేదు.

సాయంత్రం అతను యింటికి వచ్చేసరికి సావిత్రి చిరునవ్వుతో గుమ్మం దగ్గరే కనుపించగానే, శర్మ ముఖం వికసించింది.

అతను కాఫీ త్రాగుతూ అన్నాడు, "సావిత్రీ. నువ్వు మళ్లీ ఏడవనంటే ఒక్క పాయింటు చెబుతాను."

"చెప్పండి ఏడవను." అన్నది. అతను సిగరెట్టు వెలిగించుకున్నాడు.

"నేనీ కథంతా చెప్పడంలో అనవసరంగా రాధని యిరికించాను కదూ! అది నా పొరపాటు. ఎవరో అమ్మాయిని గురించి అల్లా చెప్పి నీ దృష్టిలో ఆ అమ్మాయికి లేని పోని చాంచల్యం అంటగట్టడం అన్యాయం.. కానీ ఓ విధంగా మంచిదేనేమోలే. నీ భర్త తన కాలేజీ రోజుల్లో కాలేజీ మన్మధుడనీ, గోపికల్లాగా కాలేజీ పిల్లలంతా అలమటించేవారనీ నువ్వు అనుకునే అవకాశం వుంది. అంతమందిలోంచి నన్ను ఆకర్షించి, గెల్చుకున్న కీర్తి నీకున్నదని నువ్వు గర్వించే అవకాశం కూడా వున్నది. ఏమంటావు?"

సమాధానంగా సావిత్రి లేచి లోపలికెళ్లి ఒక ఉత్తరం తెచ్చింది. చిరునవ్వుతో భర్తకిచ్చింది దాన్ని.

"మధ్యాహ్నం వచ్చింది. మీ స్నేహితురాలి దగ్గర్నుంచి"

అతృతగా మడత విప్పాడు శర్మ.

"సావిత్రి గారికి...

వ్రాయాలా వద్దా అని నాలుగు రోజులపాటు మథనపడి, చివరికి రాస్తున్నాను దీన్ని. రైల్లో మీ ప్రవర్తన నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆ తర్వాత బాధ కలిగించింది. మెల్లిగా ఆలోచించుకోగా నాకు ఒకటే అర్థం స్ఫురించింది. అది అబద్ధమైతే సంతోషమే! కానీ... నాకు సంబంధించినంత వరకు, కలత పెట్టుకోలేను నేను.

కాలేజీ రోజుల్లో నాతో శర్మగారి పరిచయాన్ని గురించి మీకు ఏవో అపోహలు వున్నట్లు నేను మీ మాటలని బట్టి పసికట్టగలిగాను. మీరు నన్ను అవమానించినంత పని చేశారు. కానీ... నేను కొంత ఆలోచించుకుంటే గానీ యిది తోచలేదు. నాకు బాధ కలిగింది.

ఆయన చూచాయగా అన్నమాటలను బట్టి మీరు వూహలు చేసుకున్నారో, లేక ఆయన స్వయంగా మీకేమైనా కల్పించి చెప్పారో నాకు తెలీదు. కానీ మిమ్మల్ని ఆనాడు చూస్తే, జాలికలిగింది. మీరు నా పేరు తెలుసుకుని, వివరాలన్నీ కనుక్కుని, వెంటనే ఏడవడం.. ఒక్కటే అర్థం కనుపించింది.

మీ సౌఖ్యానికి భంగం కలిగించే పరిచయమేదీ ఆయనకీ నాకూ లేదు. నేనింత స్పష్టంగా రాస్తున్నందుకు మీరు ఏమనుకున్నా సరే. నేనే ఏదో కల్పించుకొని, మీ ప్రవర్తనకి అర్థాలు తీస్తున్నానేమో! ఐతే... క్షమించండి కానీ, అల్లా మనం విడిపోవడం వల్ల ఏదో అసంపూర్తిగా మిగిలిపోయినట్లు అనిపించింది నాకు. నా మనస్సులోని అసంతృప్తిని తీర్చుకోవడడానికి వ్రాస్తున్నాను దీన్ని.

మరి వుంటాను.

రాధ

ఆ వుత్తరం మడిచి, శర్మ సాలోచనగా చూశాడు సావిత్రి వంక. కాస్సేపయాక నవ్వాడతను. "అఖండురాలివి సావిత్రీ నువ్వు!" అన్నాడు.

సమాధానంగా సావిత్రి నవ్విన నవ్వు, పసిపిల్ల దరహాసంలా వుంది.